వైఎస్సార్ వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

- నియోజకవర్గ వ్యాప్తంగా అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలి
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మానుగుంట


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సూచించారు. కందుకూరు పట్టణంతో పాటు, నియోజకవర్గంలో వైఎస్సార్ విగ్రహం ఉన్న ప్రతి ఊరిలో వర్ధంతిని నిర్వహించాలన్నారు. కందుకూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహం సెప్టెంబర్ 2వ తేదీ వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టాలని, అన్నదానం, పండ్లు వంటివి నిర్వహించాలన్నారు. ఇప్పటికీ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన సంక్షేమ పథకాలు అందుకోని కుటుంబం అంటూ లేదన్నారు. అనేక మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకునేందుకు బాటలు వేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి పెద్ద చదువులు చదివే అవకాశాలను పేద విద్యార్థులకు కల్పించిన ఘనత వైఎస్సార్‌దేనని స్పష్టం చేశారు. 108, 104 వాహనాలను ప్రవేశపెట్టి ప్రతి గడపకు వైద్య సేవలు అందించారని, రుణ మాఫీ వంటి పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు.

రోడ్లకు అనుమతులు

నియోజకవర్గంలో ఆరు ప్రధాన రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. వీటిలో ఇప్పటికే విక్కిరాలపేట రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చే పనులు అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని పనులు ప్రారంభకానున్నాయన్నారు. అలాగే తిమ్మారెడ్డిపాలెం నుంచి అయ్యవారిపల్లె వరకు నిర్మించనున్న నూతన రోడ్డుకు త్వరలోనే టెండర్లు పిలవనున్నామన్నారు. ఇక ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.3 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లను మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలో పలు పనులకు సంబంధించి పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవడం వల్ల కొంత ఆలస్యమైందని, కాంట్రాక్టర్లకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించి ప్రస్తుతం మరోసారి టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో 7 శ్మశానాలను రూ.80 లక్షలతో అభివృద్ధి చేస్తామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఈ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న పనులకు నాణ్యతకు సంబంధించి రాజీపడే ప్రసక్తే లేదన్నారు. నాశిరకమైన మెటీరియల్ వాడినా, పనులు నాణ్యత లేకుండా చేసినా, క్యూరింగ్ లేకపోయినా ఒప్పుకునేది లేదని, జరుగుతున్న ప్రతి ఒక్క రోడ్డు, కాల్వ నిర్మాణాలను పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ను ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ నివేదిక ఇచ్చిన తరువాతే బిల్లులు చేయాలని సూచించారు.

హైకోర్టు ఆదేశాలతోనే ఆక్రమణల తొలగింపు

పట్టణంలోని ఆక్రమణలకు సంబంధించి పలువురు హైకోర్టును ఆశ్రయించడం వల్ల ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, హైకోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని చెప్పారు. దీనిలో ఎటువంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు.

వరికూటికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు


వరికూటి అశోక్‌బాబుకు రాఖీ కడుతున్న మహిళలు

టంగుటూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆరు మండలాలకు చెందిన పలువురు మహిళలు, మర్రిపూడి మండలం కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని కె.అగ్రహారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మరియమ్మ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా వారికి వరికూటి అశోక్‌బాబు చీర, సారె అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వరికూటి సతీమణి లక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, జిల్లా పార్టీ కార్యదర్శి పోకూరి కోటేశ్వరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పోలాక్షమ్మ ఆలయంలో వరికూటి పూజలు


ఢిల్లీ పోలాక్షమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న అశోక్‌బాబు దంపతులు

జరుగుమల్లి: మండలంలోని తూమాడు గ్రామంలో ఢిల్లీ పోలాక్షమ్మ అమ్మవారి ఆలయంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, లక్ష్మి దంపతులు గురువారం పూజలు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఢిల్లీ పోలాక్షమ్మ అమ్మవారి నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రటరీ కనపర్తి శేషారెడ్డి, ఇంకొల్లు రవికుమార్, గడియం కృష్ణారెడ్డి, గడియం శ్రీనివాసరెడ్డి, భారీగా భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలు అందజేత


బీమా నగదును అందజేస్తున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: మండలంలోని కేపీ అగ్రహారం గ్రామానికి చెందిన బొప్పరాజు పిచ్చమ్మ అనారోగ్యంతో చనిపోయింది. వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరు కాగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఎంపీడీఓ టి.సుకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు వై నాగూర్‌యాదవ్ గురువారం పిచ్చమ్మ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ టి.దేవసహాయం, పీఏసీఎస్ చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన అవసరం


న్యాయసేవల ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న న్యాయవాది, ఎన్‌జీఓ, సచివాలయ సిబ్బంది

సీఎస్‌పురం (పామూరు): ప్రజలంతా ఉచిత న్యాయసేవలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది మందిరెడ్డి రామసుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని చింతపూడి గ్రామ సచివాలయంలో గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌జీఓ, పారాలీగల్ వలంటీర్ షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కోర్టుఫీజుకు సంబంధించి ఖర్చులు భరించడంతో పాటు జడ్జిమెంట్ నకళ్లను ఉచితంగా ఇస్తామన్నారు. సర్పంచ్ ముప్పాళ్ల వసంతరాజు, గ్రామస్తులు కుర్రా నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొని ప్రచారపత్రాలను ఆవిష్కరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


హోమం వద్ద పూజలు చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని కిచ్చంపల్లిలో నీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ గురువారం వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, గాయంవారిపల్లి సర్పంచ్ గాయం రామక్రిష్టారెడ్డి, రైతు సంఘ అధ్యక్షుడు శ్యాల సాంబిరెడ్డి, మాజీ రైతు సంఘ అధ్యక్షుడు కుందురు నారాయణరెడ్డి, ఏలూరి శ్రీనివాసులరెడ్డి, గాయం సుబ్బారెడ్డి, శ్యాల శ్రీనివాసురెడ్డి, అన్నపురెడ్డి సుబ్బారెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఏపీపీగా ప్రసాద్‌రెడ్డి


ఏపీపీగా నియమితులైన ప్రసాద్‌రెడ్డి

కందుకూరు: కందుకూరు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది మారే ప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. దాదాపు 3 ఏళ్ల పాటు ప్రసాద్‌రెడ్డి ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, రాష్ట్ర లీగల్‌సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జి రాజారెడ్డి, నెల్లూరు లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మానవతా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం సంస్థ అధ్యక్షులు గుత్తి శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రపంచ శాంతిని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మానవతా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా హిత కార్యక్రమాలను ప్రశంసించారు. మానవతా సంస్థ అధ్యక్షుడు గుత్తి శ్రీధర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని, నిస్సాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తున్నట్లు చెప్పారు. పేద వారికి తనవంతు సాయం ఎల్లప్పుడు అందచేస్తామన్నారు. సంస్థ జోనల్ చైర్మన్ ముక్కు బాలకృష్ణారెడ్డి, సంస్థ నాయకులు సోమిశెట్టి శ్రీనివాసులు, డాక్టర్ గురుబ్రహ్మం, సంగటి పిచ్చిరెడ్డి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, వంశీ తిమ్మరాజు, పి.అరుణోదర్, పచ్చవ శేఖర్, బొట్టు శ్రీను, కోమటిగుంట్ల బాబురావు, సింగం పల్లి ఫణీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి


వివరాలు వెల్లడిస్తున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేన్‌రెడ్డి

పామూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం మండలంలో వాడవాడలా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పామూరులో ఉదయం 9 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం వైద్యశాలల్లో పండ్లు, రొట్టెల పంపిణీ, అనంతరం పార్టీ కార్యాలయంలో సభ ఉంటుందన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల అధ్యక్షులు హాజరుకావాలని ఆయన కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు గట్లా విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

వివాహ వేడుకల్లో చింతలచెర్వు


ఉమ్మనపల్లిలో వివాహ వేడుకల్లో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి

హనుమంతునిపాడు: రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మండలంలో గురువారం జరిగిన వివాహ వేడుల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఉమ్మనపల్లి సర్పంచ్ కొదమల చిన్న మరియమ్మ కుమారుడు కొదమల బుజ్జిబాబు వివాహ వేడుకలో, తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ పరిధి వెంగపల్లిలో వనుకూరి వారి పెండ్లి వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట హనుమంతాపారం ఎంపీటీసీ తానిగుండాల తిరుపతిరెడ్డి, నందనవనం ఎంపీటీసీ నారాయణస్వామి, హాజీపురం ఎంపీటీసీ ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, సీతారాంపురం సర్పంచ్ మారంరెడ్డి రవేంద్రరెడ్డి, నాయకులు వి. బ్రహ్మారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కత్తి తిరిపాలు, కత్తి కిషోర్, ఇర్మియ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యన్నారాయణ స్వామి వ్రతం


స్వామి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

కందుకూరు: శ్రావణ పౌర్ణమి సందర్భంగా పెద్దబజార్‌లోని కోదండరామస్వామి దేవస్థానంలో గురువారం సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందుకు స్వామికి పంచామృత అభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. వ్రతంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. ప్రతి నెలా పౌర్ణమిని పురస్కరించుకుని స్వామిరి వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని, శ్రావణ మాసంలో నిర్వహించే వ్రతానికి ప్రత్యేకత ఉందని ఆలయ పూజారి రామచంద్రస్వామి అన్నారు. స్వామి వ్రతంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతుందని ఆశీర్వదించారు. ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకటసుబ్బారావు, ప్రధానకార్యదర్శి మురారిశెట్టి శ్రీను, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పబ్బిశెట్టి శివ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దొరువు ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా


దొరువు ప్రాంతంలో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: దొరువు ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని దొరువు ప్రాంతాన్ని గురువారం చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ దొరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ రూ. 2 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. తొలి విడతగా రూ.50 లక్షలతో రింగ్ రోడ్డు, విద్యుత్ లైట్లు, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పట్టణంలోనే ఆహ్లాదకరమైన ప్రాంతంగా దొరువును తీర్చిదిద్దేందుకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ పి.అరుణోదర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిషార్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే


నిషార్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

గుడ్లూరు: గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు నిషార్ భౌతికకాయానికి దప్పళంపాడు గ్రామంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. నిషార్ కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానన్నారు. మంచి మిత్రుడుని కోల్పోవడం బాధాకరంగా ఉందని ఎమ్మెల్యే సంతాపం తెలియజేశారు.

భూ సర్వేకు రైతులు సహకరించాలి


రీసర్వే గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుందరమ్మ

వలేటివారిపాలెం: మండల పరిధిలోని కొండసముద్రంలో జగనన్న భూ హక్కు, జగనన్న శాశ్వత భూ రక్ష పథకం కింద కొండసముద్రం రెవెన్యూ పొలాలను భూ సర్వేకు ఎంపిక చేసినట్లు తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. గతంలో బ్రిటీష్ పరిపాలన సమయంలో భూ సర్వే చేశారని, ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం మరలా రీసర్వే ఉచితంగా చేస్తుందని ఆమె తెలిపారు. కొండసముద్రం రెవెన్యూ పరిధిలోని రైతులతో పాటు ఉప్పలపాడు రైతులు తమ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో పాటు భూ రికార్డులు, ఆధార్‌కార్డు, ఫొటోలను వీఆర్‌ఓకు అందజేయాలన్నారు. రెవెన్యూ అధికారులు రైతుల భూమలను సర్వే చేస్తున్నప్పుడు రైతులు దగ్గర ఉండి కొలతలు సర్వే చేయించుకోవాలన్నారు. కొలతలు వేసిన భూములకు ప్రభుత్వమే సరిహద్దు రాళ్లు ఉచితంగా వేస్తారని ఆమె పేర్కొన్నారు. రీ సర్వే సమయంలో రైతులు అధికారులకు సహకరించాలన్నారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్, వీఆర్‌ఓ తిరుపతిరావు, సర్పంచ్ మన్నం వెంగమ్మ, వీఆర్‌ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన

హనుమంతునిపాడు: హనుమంతునిపాడు, కనిగిరి, వెలిగండ్ల మండలాల్లో మండలలో ఫిజిక్స్ సబ్జెక్టు బోధించే ఉధ్యాయులకు మూడు మండలాల స్థాయిలో జరుగుతున్న కాంప్లెక్స్ శిక్షణ తరగతులను , మండల స్థాయి ప్రాథమిక పాఠశాలలో సైన్సు బోధించే ఉపాధ్యాయులకు జగుతున్న శిక్షణ తరగతులు ఎంఈఓ ఎస్ .రమణయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన బోధన విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా కాంప్లెక్స్ శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. సులభ పద్ధతులో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఉలవపాడు: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓలు ప్రసాదరావు, రమణయ్య అన్నారు. వీరేపల్లి మోడల్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని 1 ఎంఈఓ ప్రసాదరావు, రామాయపట్నం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ రమణయ్య పరిశీలించారు. విద్యార్థులకు రుచిగా నాణ్యంగా భోజనం వండాలని కుకింగ్ సిబ్బందికి తెలిపారు. భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉలవపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ప్రైమరీ స్కూల్‌కాంప్లెక్స్‌ను ఎంఈఓ ప్రసాదరావు పరిశీలించారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు శివనాగేశ్వరరావు, కాంప్లెక్స్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి


సూపర్‌వైజర్ సుచరిత

మర్రిపూడి: అంగన్‌వాడీ విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత తెలిపారు. స్థానిక జనరల్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం కార్యకర్తలతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 54 కేంద్రాల్లో 1847 మంది అంగన్‌వాడీ విద్యార్థులు ఉన్నారన్నారు. అలాగే 507 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారని, వారికి ప్రతి నెలా మంచి భోజనంతోపాటు పాలు, గుడ్లు, చిక్కీలు అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు విడుదల

పీసీపల్లి: మండలానికి నూతనంగా 121 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శుక్రవారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆయా సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

టంగుటూరు: టంగుటూరు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో వితంతు, వికలాంగ, డయాలసిస్ పింఛన్లు నూతనంగా 250 మంజూరైనట్లు ఎంపీడీఓ రత్నజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పింఛన్లను సెప్టెంబర్ 2న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు హెల్మెట్లను అందజేస్తున్న వాహనాల తనిఖీ అధికారి, అసోసియేట్ డీన్

కందుకూరు రూరల్: ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కే.ఎండీ రఫీ అన్నారు. మండలంలోని ఓగూరు గ్రామం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాలలో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి అందరికీ అవగాహన ఉండాలన్నారు. రహదారి భద్రత గురించి అందురు తెలుసుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహితంగా వాహనాలను నడపాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మానవతా దృక్పథంతో తమ వంతు సహాయ చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరు రహదారి భద్రతలను పాటిస్తూ ప్రమాద బారిన పడకుండా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ ఎస్ఎస్. విజయపద్మ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో రహదారి భద్రత పట్ల కూడా అవగాహన అంతే ముఖ్యమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహితంగా ప్రయాణాలు సాగించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ముంతాజ్‌బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ యాత్ర స్పెషల్ బస్సు

కందుకూరు: పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం కందుకూరు డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పెద్దన్నశెట్టి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి నల్గొండ జిల్లా కోదాడ సమీపంలోని ఎర్రవరం గ్రామంలో స్వయంభూగా వెలిసిన బాలఉగ్ర నరసింహ దేవస్థానానికి, పెనుగ్రంచిపోలు లక్ష్మీతిరుపతమ్మతల్లి దర్శనానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు సెప్టెంబర్ 8వ తేదీ శనివారం రాత్రి 9 గంటలకు కందుకూరు డిపో నుంచి బయలుదేరుతుందని, ఆదివారం లక్ష్మీతిరుపతమ్మతల్లి దర్శనం అనంతరం ఎర్రవరం బాల ఉగ్ర నరసింహస్వామిని దర్శించుకుంటామన్నారు. అనంతరం అదే రోజు బయలుదేరి కందుకూరు వస్తుందన్నారు. బస్సులో ఒక్కరికి రానుపోను టికెట్ ధర రూ.1100 మాత్రమేనని, పూర్తి వివరాలకు 9959225698, 7382889870 నంబర్లను సంప్రదించాలని కోరారు.